# శమంతకమణి చారుశాస్త్రి

భానుమతీ రామకృష్ణ

శమంతకమణి మొగుడు చారుశాస్త్రి ఒట్టి చాదస్తుడూ, పిరికివాడూ, పిసినారీ, మతిమరుపు మనిషి!.... అన్నిటికంటే అతనికుండే దరిద్రపు అలవాటు ఏమిటంటే ఎదుటివాళ్ళతో మాట్లాడుతూనే మధ్యలో గురకబెట్టి నిద్రపోతాడు! ....అదే శమంతకమణికి చిర్రెత్తుకొచ్చే విషయం.... శమంతకమణి భాషలో చెప్పాలంటే చారుశాస్త్రి ఒట్టి అరశికుడూ, మొరటువాడూ.... అతన్ని చూస్తేనే ఒళ్లు మంట అంటుంది శమంతకమణి పళ్లు కొరుకుతూ....

అసలు చారుశాస్త్రి ఏమిటీ వెధవ పేరు!.... పులుసు శాస్త్రి అని పెట్టారు గాదు దరిద్రులు— చారుశాస్త్రి తల్లి దండ్రులు చిన్నప్పుడే పోవడంవల్ల మేనత్త వెధవముండలే పెంచారు చారుశాస్త్రిని.... అందుకే చారుశాస్త్రికి అన్నీ ఆ వెధవముండల అలవాట్లు, బుద్ధులే వచ్చాయి.... చారుశాస్త్రికి వంట నేర్పిందీ వాళ్లే!.... వాళ్ళ పెంపకంలో చారూ, పప్పూ, పులుసూ మార్చి మార్చి తిని మాట్లాడుతూనే గురకపెట్టి నిద్రపోవడం అలవాటయింది దరిద్రుడికి.... అంటుంది శమంతకమణి.... అంతేగాదు తను ప్రేమించిన ప్రేమ్‌కుమార్ అనే కన్నడం అబ్బాయిని చేసుకోడానికి ఒప్పుకోకుండా యీ మొరటువాడి చేతికి తనలాంటి మొగలిపువ్వును అందించి చచ్చిపోయిన తన తండ్రిని రోజుకి పదిసార్లయినా తిట్లుతో చంపుతూంటుంది.

అసలు శమంతకమణి అందగత్తె మాత్రమేగాదు సౌందర్యోపాసకురాలు.... మహా రసికురాలు గూడా.... ఒక్క మాటలో చెప్పాలంటే మంచి 'టేస్టు'గల మనిషి!.... సృష్టిలో వుండే మంచివన్నీ తనకు చెందాలని ఆరాటపడే ఆడది.... అవి ఎలాగైనా పొంది అనుభవించేందుకు ఎలాంటి సాహసాలైనా చేయడానికి వెనుకాడదు.... లేకపోతే జీవితం వృథా అంటుంది....

అసలు శమంతకమణికి పర్సనాలిటీ లేని మగాళ్లంటే ఒళ్ళు మంట.... అలాంటి మగవాళ్ళని కన్నెత్తి కూడా చూడదు.... పర్సనాలిటీలేని చారుశాస్త్రిని పెళ్లాడి తన జీవితం అడవిగాచిన వెన్నెల అయిందని కన్నీళ్ళు పెట్టుకుంటుంది శమంతకమణి.... చారుశాస్త్రి తెల్లగా వుంటాడని పెళ్లప్పుడూ అంతా మెచ్చుకున్నారు.... ఎందుకూ వెధవ తెలుపు!.... అడుక్కు తిననూ.... ఒడ్డూ, పొడుగ్గా వుండకుండా, పొట్టిగా బూడిద గుమ్మడికాయలా వుండడం గూడా ఓ అందమేనా!.... ఛీ ఛీ-

చారుశాస్త్రి పొట్టిగా వుంటాడు.... దానికి తోడు పొట్ట వేరే!.... తొండం ఒక్కటే తక్కువ!.... ఎప్పుడూ ఏదో ఒకటి తింటూనే వుంటాడు.... ఏదీలేని రోజున వంటయింట్లోకెళ్ళి శనగపప్పో, కందిపప్పో నోటినిండా వేసుకొని బొక్కుతుంటాడు.... సినిమాకెళ్తే ఆట మొదలుపెట్టే సరికి పక్క సీట్లో జారగిలబడి గురకబెట్టి నిద్రపోతాడు.... చారుశాస్త్రితో సినిమా కెళ్ళడం అంటేనే రోతపుట్టింది శమంతకమణికి,

సాయంకాలం ఇంటికి వచ్చేటప్పుడు తనకు ఏ పూలో, పిల్లలకు ఏ పండ్లో తెస్తాడా!.... తన కిష్టమైన అంబికా అప్పడాలు, అంగట్లో అమ్మే ఆవకాయ సీసా కొనుక్కొస్తాడు గొప్పగా.... ఎవడిక్కావాలి ముష్టి ఆవకాయ, అప్పడాలూ!.... ఆ మేనత్త వెధవ ముండల పెంపకం! అందుకే ఆ టేస్టు! మరి యింత విరోధంతో యిద్దరు పిల్లలు ఎలా పుట్టారు....అని అడిగితే "ఆ ఏదో పుట్టారు, పశువులూ కంటున్నాయిగా! ...." అంటుంది విరక్తిగా శమంతకమణి....

చారుశాస్త్రికి శమంతకమణి అన్నా, పిల్లలన్నా పంచప్రాణాలు.... తన ప్రేమ ఎలా వ్యక్తంచేసుకోవాలో తెలీకపోయినా శమంతకమణిని విడిచిపెట్టి చారుశాస్త్రి ఒక్క క్షణం వుండలేడు!.... అందుకే శమంతకమణికి చారుశాస్త్రి ఒక విధంగా లోకువయ్యాడు అనాలి.

చారుశాస్త్రికి ఉద్యోగం అయినప్పట్నుంచీ వెంట వెంటనే ఒక వూరునుండి

వూరికి ట్రాన్స్‌ఫర్స్ కావడం, చారుశాస్త్రితో పనిచేసే తోటి ఆఫీసర్లకి అర్థంగాని సమస్యగా తయారయింది! చారుశాస్త్రి ఉద్యోగంలో చేరిన ఏడాది లోపల అది ఆరవ ట్రాన్స్‌ఫర్. ఆంధ్ర దేశానికి అంచుల్లోవున్న వూరికి వేశారు యీ సారి చారుశాస్త్రిని.... తన పై ఆఫీసర్ పరమానందం తెలుగువాడు కావడం కొంత మెరుగు అనుకున్నాడు చారుశాస్త్రి.

కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయివచ్చిన తన కింద ఉద్యోగస్తులకు ఆ రోజు తన యింట్లో పార్టీ ఏర్పాటు చేశాడు పరమానందంగారు.... ముఖ్యంగా తనకింద ఉద్యోగస్తుల భార్యల అందచందాలు చూసి ఆనందించేందుకే తరచు యిలాంటి పార్టీలు యేర్పాటు చేస్తుంటాడు పై ఆఫీసర్ పరమానందం.... భార్య భారతమ్మ పూర్వకాలం మనిషి....వంట గది దాటి బయటికి రాదు.

ఆ రోజు రాత్రి డిన్నరు పార్టీకి మిగిలిన వాళ్ళతోపాటు శమంతకమణీ చారుశాస్త్రీ గూడా వచ్చారు, పసిబిడ్డల్ని పక్క భాగంలో వుండేవాళ్ళ దగ్గర వదిలి.

శమంతకమణిని చూస్తూనే పరమానందం బ్రహ్మానందంతో తన పరిసరాలే గాక ప్రపంచాన్నే మర్చిపోయి రెప్ప వాల్చకుండా శమంతకమణినే చూట్టం పార్టీకొచ్చిన వాళ్లంతా గమనించి ముసిముసి నవ్వులతో ముఖాలు తిప్పుకుని విందులో మునిగిపోయారు. శమంతకమణికి స్పెషల్ ప్లేట్లో ఒకటి రెండుగా తనే స్వయంగా వడ్డించి తీసుకొచ్చి అందించాడు, అయిదడుగులకు ఆరంగుళాలు తక్కువున్న యాభైఏళ్ల పైబడ్డ బట్టతల పరమానందం, మెరిసే కట్టుడు పళ్లు బయటపడేట్టు నవ్వుతూ. పార్టీ జరిగినంతసేపూ మరెవ్వర్నీ పలకరించకుండా శమంతకమణి పక్కనే కూర్చుని ఆమె అందాన్నీ చారుశాస్త్రి అదృష్టాన్నీ వర్ణిస్తూనే వున్నాడు పరమానందం....

అంతమందిలో తన వంక ఆధిక్యత యిచ్చి తన అందాన్ని అంత మెచ్చుకోడం, ఒకవైపు గర్వమూ, ఆనందమూ కలిగించినా, మరొక వైపు అతను ముసలివాడు కావడం, దానికి తోడు పర్సనాలిటీ లేకపోవడం, బట్టతల, కట్టుడు పళ్లూ కావడం శమంతకమణికి కాస్త చికాకు కలిగించింది....

అన్నీ స్పెషల్‌గా తనకే తెచ్చి వేయడం చుట్టూవున్నవాళ్ళు గమనించి మరీ గుసగుసలు ఎక్కువయ్యాయి....

యిలాంటి విషయాలు లెక్కచేయని శమంతకమణి చారుశాస్త్రి ఏంచేస్తున్నాడోనని టేబిల్‌చుట్టూ వున్న గుంపులో వెతికింది.... అక్కడ లేడు. ఒక మూల కుర్చీలో కూర్చుని చుట్టూ అయిదారు పదార్థాలలో నిండిన ప్లేట్లు పెట్టుకొని ప్లేటు తర్వాత ప్లేటు గబగబ లాగి పారేస్తున్నాడు, తిండికి మొహంవాచిన వాడిలాగా.... ఛీ ఛీ ఒట్టి గర్భాత్రం మనిషి.... పార్టీ కొచ్చినప్పుడైనా కాస్త తక్కువ తినగూడదూ!.... పోనీ తినేది అందర్లా అటూ యిటూ తిరుగుతూ సరదాగా మాట్లాడుతూ నాజూగ్గా నిదానంగా తినకూడదూ!.... సభ్యతలేని మనిషి!.... చారుశాస్త్రిని చూసి ఆఫీసర్ పరమానందం గూడా నవ్వాడు.... శమంతకమణి తల కొట్టేసినట్లయింది.

రాత్రి పార్టీ అయ్యేసరికి పొద్దుపోవడమే గాకుండా ఉరుములూ మెరుపుల్తో వర్షం ఆరంభం అయింది. పార్టీకి వచ్చినవాళ్ళంతా అప్పటికే చాలామంది పరమానందంతో చెప్పి వెళ్లిపోయారు యింట్లో పిల్లలు ఏడుస్తారనీ, బస్సులు దొరకవనీ చాలా దూరం వెళ్లాలనీ చెప్పి డిన్నరు అవుతూనే వెళ్ళిపోయారు.... చారుశాస్త్రి తిండి తిని ముగించేలోగా ఒకసారి యిల్లంతా చూపించాడు శమంతకమణికి పరమానందం.... తను ఏ ఏ వూర్లనుంచి ఏ ఏ సామాన్లు తెచ్చిందీ, తన కెన్ని బహుమతులు వచ్చిందీ అన్నీ చెప్పి మళ్ళీ డిన్నరు హాల్లోకి వచ్చేసరికి ఒక మూల సోఫాలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు చారుశాస్త్రి!.... పక్కనున్న సిగరెట్ 'యాష్ట్రేతో' అతని బుర్ర బద్దలు కొట్టాలన్నంత కోపం వచ్చింది శమంతకమణికి.... ఒట్టి పశువు....

అంతా వెళ్లిపోయారు.... చివర జంట స్కూటర్లో బయల్దేరారు.... "వర్షం ఎక్కువైంది యింటి కెళ్తాం!" అన్నది ఆఫీసర్ పరమానందంతో.... పరమానందం అదోలా నవ్వుతూ వర్షం ఎక్కువైతే యింటి కెలా వెళ్తారు!.... తగ్గింతర్వాత గదా వెళ్లాలి!....అన్నాడు సోఫాలో కూర్చోబోతూ.... "లేదండీ వెళ్ళాలి. చాలా పొద్దు పోయింది. ఆయన్ని లేపుతాను..."అంటూ ముందుకు పోబోయింది. టక్కున చెయ్యి పట్టుకుని ఆపాడు పరమానందం నవ్వుతూ.... బిత్తరపోయి చూసింది అతన్ని.... "నీ కా మూర్ఖుడు మొగుడా! చూడూ నీ మెడ ఎంత బోసిగా వుందో! చంద్రహారం చేయిస్తాను" అంటూ చెవి దగ్గర కొచ్చి ఏదో చెప్తున్నాడు. ఫెళఫెళ మని పెద్ద ఉరుములు రావడం, కరెంట్ పోవడం ఒకేసారి జరిగాయి.... చీకట్లో ఆఫీసర్ శమంతకమణి దగ్గరికి లాక్కున్నాడు.... ఒక్క విదిలింపుతో వచ్చి ఆ చీకట్లోనే చారుశాస్త్రిమీద పడ్డది. "ఏమండీ! ఏమండీ! లేవండీ! పిడుగులుపడుతున్నా ఏమిటీ గురక!" అని బలంగా భుజంపట్టి కుదిపింది.... ఉలిక్కిపడి లేచిన చారుశాస్త్రి.... "ఏమైందీ.... పిడుగులు పడ్డాయా! ఎక్కడా!...." అంటూ ఖంగారుగా లేచాడు....చటుక్కున లైట్లు వెలిగాయి!



హడావిడిగా పక్క రూములోకి వెళ్ళిపోతూన్న పరమానందాన్ని బెదిరిన లేడిలా శమంతకమణి చూడడం చారుశాస్త్రి గమనించాడు.... చారుశాస్త్రి గుండె గతుక్కుమంది.... ట్రాన్స్‌ఫర్ తప్పదా! .... "ఏంటలా దయ్యంలా చూస్తారు? వర్షంలో తడిసినా ఫర్వాలేదు, బయల్దేరండి. ఒక్క క్షణం గూడా యిక్కడ వుండను".... అంటూ చారుశాస్త్రి జవాబుకి ఎదురుచూడకుండానే గబగబ బయటికి నడిచింది శమంతకమణి.... చారుశాస్త్రి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి ట్రాన్స్‌ఫర్ ఖాయం అని గొణుక్కుంటూ కోటు భుజానవేసుకొని బయటికి నడిచాడు....మర్నాడే చారుశాస్త్రి మరో వూరికి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు.

యీసారి వరంగల్ కేశారు. ముందుగానే వెళ్ళి చారుశాస్త్రి తనపై

ఆఫీసర్ వయసూ, వాలకం కనుక్కొని వచ్చాడు. పై ఆఫీసర్ ముసల్మాన్– ఖాన్ అబ్దుల్ కరీంఖాన్ ఆయన పేరు! దాదాపు అరవై ఏళ్ళవాడు. జుట్టు నెరిసిపోవడమే కాకుండా, పళ్లు గూడా కట్టుడువేననీ కాకపోతే డబ్బుగలవాడు గనక అన్ని పళ్లూ బంగారంతోనే కట్టించుకున్నాడనీ తెలిసింది.... ఫర్వాలేదు అనుకుని చారుశాస్త్రి మనసు కాస్త కుదటపడ్డది.... కాని మనసులో ఎక్కడో ఏదో భయం?.... ముందు ఆఫీసరూ వయసు మళ్లినవాడే మరి.... ఏంటో ఆడదాని విషయంలో బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు! అసలీ ఆఫీసర్ల పార్టీలకు తను వెళ్ళడం ఎందుకు! యీసారి వెళ్లినా శమంతకమణిని ఎట్టి పరిస్థితుల్లో గూడా తీసుకెళ్ల గూడదు.... అని ఒక నిర్ణయానికొచ్చాడు చారుశాస్త్రి. తన కిచ్చిన క్వార్టర్ వూరికి చాలా దూరంలో వుంది.... బస్సు దిగి చాలా దూరం నడవాలి.... తనొక స్కూటర్ గూడా కొనలేకపోతున్నాడు....అందుకే శమంతకమణికి తనంటే అంత అలక్ష్యం! వూళ్ళో అప్పటికే ఏవో సమ్మెలూ అల్లర్లూ జరుగుతున్నాయని తెలిసి శమంతకమణిని తలుపులు గడేసుకుని లోపలే వుండమని మరీ చెప్పి వచ్చాడు.... ఆఫీసు నుంచి సాయంకాలం యింటికొస్తూంటే బస్సు దిగగానే ఆ ప్రాంతం అంతా అల్లర్లతో జనం గలాటాచేస్తూ సోడాబుడ్లు విసురుకోడంతో భీభత్సంగా కనిపించింది. తన యింటికి వెళ్లే దోవంతా జనం పరిగెత్తుతూ రక్షణ కోసం తలో వైపు పిల్లామేకాతో పరుగెత్తుతున్నారు. చారుశాస్త్రి గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలెట్టాయి.... శమంతకమణి ఏమైందో.... చారుశాస్త్రి పరుగెత్తడం మొదలెట్టాడు తన యింటి వేపు పిచ్చివాడిలాగా– తనకంటే ముందు తనతో పనిచేసేవాళ్ళు గూడా తనలాగే వాళ్ళ వాళ్ళ యిళ్లవైపు స్కూటర్లూ, ఆటోల్లో ఖంగారుగా వెళ్తున్నారు. తను ఆటోరిక్షా పిల్చే స్థితిలోలేడు....ముందు వెళ్లి శమంతకమణిని చూడాలి.... మతిపోయినట్లు తన యింటితలుపు దబదబ బాదడం మొదలెట్టాడు.... "మణీ మణీ" అంటూ– జనం తన యింటివైపే తోసుకొస్తూన్నారు దెబ్బలాడుకుంటూ.... చారుశాస్త్రికి ముచ్చెమటలు పోశాయి.... కొత్తవూరు, అక్కడనుంచి ఆ క్షణంలో ఎలా బయటపట్టం! జడ అల్లుకుంటున్న శమంతకమణి తాపీగా వచ్చి తలుపు తీసింది.... అబ్బ! కొంత ప్రాణం వచ్చింది చారుశాస్త్రికి.... "ఏంటీ ఏమిటంత ఖంగారు పడుతున్నారు!" అడిగింది శమంతకమణి.

"అటు చూడు!" అంటూ కాస్త దూరంలో జరుగుతున్న గలాటా చూపించాడు శమంతకమణికి. "అవునూ ఏవో అల్లర్లట. 'కర్ఫ్యూ' గూడా పెడతారట, యీ పూట నుంచి యీ వైపు.... పక్కింటివాళ్ళు చెప్పారు."

"ఆ! కొంపమునిగింది....యిప్పుడేం చేయడం!" అని చారుశాస్త్రి వంటింట్లో చతికిలబడ్డాడు....

"పక్కింటి వాళ్ళంతా తెలిసినవాళ్ళ యిళ్ళకి వెళ్లిపోయారు"అన్నది శనుంతకమణి.

"మనకీ వూర్లో ఎవరూ తెలిసినవాళ్ళు గూడా లేరే! కర్ఫ్యూ పెడితే యిబ్బంది పడిపోతామే!....ఎక్కడి కెళ్ళడం...." అంటూ చారుశాస్త్రి ఖంగారుపట్టం మొదలెట్టాడు. జనం అరుపులు దగ్గర పడుతున్నాయి– చారుశాస్త్రికి గుండె దడ ఎక్కువైంది. పిల్లలు చాపమీద నిద్ర పోతున్నారు. చారుశాస్త్రికి ఏంచేయాలో తోచలేదు....

"మీ తోటి ఆఫీసర్లు మీకు సాయం చేయరా! పోనీ యీ అల్లర్లు తగ్గేదాకా యీ పూటకి ఎవరింటికన్నా పోదాం!" అన్నది శమంతకమణి.

"వాళ్ళంతా ఎటు వెళ్లారో తెలీదు– అసలు వాళ్ళ యిండ్ల అడ్రసులు నాకు తెలీదు. నిన్నగాక మొన్న వచ్చాం!...." అన్నాడు చారుశాస్త్రి నిస్పృహగా

"పోనీ మీ పై ఆఫీసర్‌కి ఫోన్‌చేసి పరిస్థితి చెప్పి ఆయన సలహా తీసుకోండి" అన్నది శమంతకమణి చారుశాస్త్రికి మంచి నీళ్లిస్తూ –

ఆ మాట వినగానే చారుశాస్త్రి గుండె గతుక్కుమంది!.... మళ్ళీ ట్రాన్స్‌ఫర్ తప్పదా!.... దీనంగా శమంతకమణి వైపు చూశాడు.... అది గ్రహించిన శమంతకమణి "పై ఆఫీసర్ అనగానే ఎందుకలా గతుక్కుమంటారు" అన్నది కోపంగా....

"ఏం లేదూ, వీడూ నీ చెయ్యి పట్టుకొంటే...శ"మంతకమణిచిరాకుపడుతూ–

"అందరూ చెయ్యి పట్టుకొనేవాళ్లే వుంటారా మీ చాదస్తం! ప్రతిదీ అనుమానం....మీ యిష్టం ఏమన్నా చేయండి" అంటూ వంటిట్లో కెళ్లింది కోపంగా.

చారుశాస్త్రికేం పాలుపోలేదు–అన్యథా శరణం నాస్తి తక్షణం పరుగెత్తుకెళ్లి పై ఆఫీసర్ అబ్దుల్‌కి ఫోన్‌చేశాడు.... కర్ఫ్యూ వుండే చోట కాల్పులు గూడా జరగొచ్చనీ తక్షణం భార్యతో తన యింటికి రమ్మనీ పై ఆఫీసర్ అబ్దుల్ కరీంఖాను ఫోన్‌లో చెప్పేశాడు చారుశాస్త్రికి.

ఇంటి వెనకవేపు నుంచి పరుగెత్తుకెళ్లి ఒక ఆటోరిక్షా మాట్లాడి తెచ్చి శమంతకమణీ పిల్లల్తో పై ఆఫీసర్ అబ్దుల్ కరీంఖాను యింటికి బయల్దేరాడు చారుశాస్త్రి.


అబ్దుల్ ఖాదర్ ఎంతో అభిమానంతో ఆహ్వానించాడు చారుశాస్త్రి దంపతుల్ని... అబ్దుల్ ముగ్గురు కూతుళ్లూ పెళ్లిళ్ళయి అత్తారిండ్లకెళ్ళారు.... రోగిష్టి భార్య 'రుమేటిజమ్'వ్యాధితో ఎప్పుడూ మంచంలోనేవుంటుంది. శమంతకమణిని

చూస్తే అబ్దుల్ ఖాదర్ వయసు అరవయి నుంచి ముప్పయికి దిగింది.... చిన్న పిల్లాడిలా హుషారుగా స్పెషల్ మర్యాదలు చేయడం మొదలెట్టాడు. శమంతకమణికి. చారుశాస్త్రికి మళ్ళీ గాభరా మొదలైంది.... శమంతకమణి అందాన్ని చూపుల్తోనే జుర్రుకొంటున్న అబ్దుల్ ఖాదర్‌తో శమంతకమణి రెండు మూడు మాటలు హిందీలో మాట్లాడింది. దాంతో అబ్దుల్ ఖాదర్ మరి కాస్త పొంగిపోయాడు.

బిడ్డల్ని ఓ మూల సోఫాలో జోకొడుతూ కూర్చున్న చారుశాస్త్రికి అబ్దుల్ ఖాదర్ శమంతకమణి మీద చూపే ఆదరణకు ఒక వైపు భయమూ మరో వైపు ఒళ్ళు భగ్గున మండిపోవడం మొదలెట్టింది.... పైగా హిందీలో వేరే మాట్లాడుతోంది....ఛీ. ఛీ. యీ ఆడవాళ్ళు ఎప్పుడు ఏం చేస్తారో ఎవరికీ తెలీదు.... నోరు మూసుకొని పిల్లల్తో ఓ మూల కూర్చోకూడదూ అందరు ఆడవాళ్ళ లాగా.... తనను చవటని చేసి పిల్లల్ని తన ఎదన పడేసి తన పై అఫీసర్‌తో తను జమాయించి హిందీలో మాట్లాడుతూంటే తను ఆడదానిలాగా ఓ మూల పిల్లల్తో కూర్చోవలసి వచ్చింది.... యిందుకే భార్యా రూపవతీ శత్రుః అన్నారు పెద్దలు.

పనివాడిచేత హోటల్నుంచి భోజనం తెప్పించాడు అబ్దుల్ ఖాదర్, శమంతకమణికీ చారుశాస్త్రికీ.... ఆకుల్లో తనకీ చారుశాస్త్రికీ వడ్డించింది శమంతకమణి, అబ్దుల్ ఖాదర్‌తో హిందీలో వడ్డించిన వంటకాల పేర్లూ చెప్తూ....

ఆకలి పేగులు కొరికేస్తోంది.... చారుశాస్త్రికి. అందులోనూ ఆకులో గోంగూర పచ్చడీ మునక్కాడల పులుసు చూడగానే ఆఫీసర్ని శమంతకమణినీ కాసేపు మర్చిపోయి ఆకుముందు కూర్చొని శమంతకమణి కోసం గూడా




ఆగకుండా గబగబా గోంగూర పచ్చడీ అన్నం కలిపి, నెయ్యి గిన్నె అన్నంమీద బోర్లించి లబక్కు లబక్కున ముద్దలు మింగేయడం మొదలెట్టాడు.... ఆ దెబ్బతో ఎక్కిళ్ళొచ్చాయి.... అది చూసిన శమంతకమణికి చారుశాస్త్రి మీద ఎక్కడలేని అసహ్యమూ ఏవగింపూ కలిగాయి.... పక్కన యింకా మంచి నీళ్ళు కూడా పెట్టలేదు.... పచ్చడి చాలా కారంగా వుంది- అబ్దుల్ ఖాదర్ చారుశాస్త్రిని చూసి నవ్వుతూ అహిస్తా ఖాలో భాయీ జల్దీ క్యా హై!...." అన్నాడు లోపలికి వెళ్తూ.... చారుశాస్త్రి బిక్కచచ్చిపోయాడు తన గర్భాతానికి. తన మీద తనకే అసహ్యం వేసింది కాసేపు.... శమంతకమణి కావాలనే మంచినీళ్ళు యివ్వకుండా తనూ కూర్చుంది భోజనానికి. పనివాడు తెచ్చిన గ్లాసుడు మంచినీళ్ళు గొంతులో పోసుకొన్న తర్వాత ఎక్కిళ్ళ తగ్గాయి. యీ లోపల పిల్లలు లేచారు....

"కాసేపు తినడం ఆపి వాళ్ళని చూడండి." అన్నది లోలోపలే కోపం అణుచుకొంటూ.... పాపం చారుశాస్త్రి చేసేదిలేక చెయ్యి కడుక్కొని ఏడుస్తున్న పిల్లల్ని జోకొట్టడానికి వెళ్ళాడు. అబ్దుల్లా

ఈలోగా లోపల్నుంచి పండ్లూ స్వీట్సూ తెచ్చి శమంతకమణి కిచ్చాడు....

"యివన్నీ ఎందుకు? మీ అభిమానమే చాలు" అన్నది హిందీలో శమంతకమణి. అది చూసిన చారుశాస్త్రి గుండె గతుక్కుమంది.... ధోరణి బాగా లేదు....' తను ఏమీ చేయలేని అసమర్థుడు.... అన్నం కూడా పూర్తిగా తినేందుకు నోచుకోలేదు- పిల్లలు నిద్రపోయారు- మళ్ళీ వచ్చి చారుశాస్త్రి అన్నం తిందామనుకునేసరికి అప్పటికే శమంతకమణి భోజనం అయిపోవడంవల్ల పనివాడు ఆకులు రెండూ తీసేసి తన పని ముగించుకెళ్ళాడు.... చారుశాస్త్రి ప్రాణం వుసూరుమన్నది.... యిదేదీ పట్టనట్లు అబ్దుల్లా యిచ్చిన పండ్లనీ స్వీట్స్‌నీ నాజుగ్గా తింటూ హిందీలో మాట్లాడుతూనే వుంది శమంతకమణి....పోనీ తనకూ పండైనా యిస్తే ఆకలి తీరును.... అడగడం సభ్యత కాదంటుంది శమంతకమణి!.... మరి ఆకలి మాట! పక్కనే వున్న గ్లాసుడు మంచినీళ్ళ తాగి మళ్ళీ పిల్లల దగ్గరకెళ్ళి కూర్చున్నాడు.... పెళ్ళాం పక్కనే కూర్చుంటే అఫీసర్‌కి కోపం వస్తుందేమోనన్న భయంతో.... చారుశాస్త్రి.... "మేము ఎక్కడ పడు

కోవాలి !" అన్నది శమంతకమణి హిందీలో.

"సబ్ తయార్ హై- రెడీ !" అని పక్క గది చూపించాడు అబ్దుల్ ఖాదర్ నవ్వుతూ.... అతని ధోరణి శమంతకమణికి నచ్చకపోయినా ఏదో ముసలి పీనుగులకి అలాంటి చపలం వుండడం సహజమేనని సరిపెట్టుకున్నది....

శమంతకమణికి పరుపూ దిండ్లూ, చారుశాస్త్రికి చాపా దిండూ వేసివున్నాయి. గదిలో పిల్లల్ని చాపమీద పడుకోపెట్టి పక్కనే నడుంవాల్చాడు చారుశాస్త్రి.

పరుపుమీద శమంతకమణి పడుకున్న తర్వాత పక్కగదికెళ్ళి లైట్లాఫ్ చేశాడు అబ్దుల్ ఖాదర్. అంతా చీకటి !.... మరి పిల్లలు ఏడిస్తే చిన్న లైటుగూడా లేదే లేవడానికి! అనుకుంది శమంతకమణి.... టేబిల్‌మీద టార్చిలైటు చూసిన గుర్తు- పిల్లలు లేచినప్పుడు చూడవచ్చులే అని పడుకుంది.... అప్పటికే చారుశాస్త్రి గురక ఆరంభం అయింది.

పక్కనున్న దిండుతో చెవులు మూసుకొని నిద్రపోవడానికి ప్రయత్నించింది.

అర్ధరాత్రి పన్నెండు గంటల ప్రాంతాల్లో ఎవరో తన చెయ్యి పట్టుకొన్నట్లు చీకట్లో శమంతకమణికి అనిపించి కళ్లు తెరిచి చూసింది.... అబ్దుల్ ఖాదర్ బంగారు పళ్ళు బయటపెట్టి నవ్వుతూ తన పడకగదికి రమ్మని సైగచేస్తున్నాడు.... శమంతకమణికి ఎక్కడలేని భయమూ కంపరమూ కలిగాయి.... చారుశాస్త్రి గది అదిరిపోయేట్లు గురకపెడుతున్నాడు !....ఏం చేయాలో తోచని శమంతకమణి గాభరా పడిపోతూ, "ఏమండీ ! ఏమండీ ! ఎవరో వచ్చారు లేవండి, లేవండీ" అంటూ పిల్లవాడి పాలసీసాతో గుర్రుపెడుతున్న చారుశాస్త్రి తలమీద గట్టిగా బాదింది.

"ఆ !.... ఎవరూ?! చచ్చారా !.... ఎవరు చంపారు !.... ఎక్కడ !.... అల్లర్లు తగ్గలేదా...." అంటూ నిద్రమత్తులో కలవరిస్తూ లేచాడు ఖంగారుగా.

యీలోగా ఆఫీసర్ అబ్దుల్ ఖాదర్ మెల్లిగా తన గదిలోకి జారుకున్నాడు.... అబ్దుల్ ఖాదర్ అతని గదిలోకి గబ గబ పోవడం మసక చీకట్లో చారుశాస్త్రి కంటపడ్డది.... కొంప మునిగింది.... అనుకున్నంతా అయింది.... యీ సారీ ట్రాన్స్‌ఫర్ తప్పదు....

"యిక్కడ ఉక్కపోస్తోంది.పిల్లల్ని తీసుకొని తెల్లారిందాకా బయట వరండాలో కూర్చుందాం రండి" అంటూ ఒక బిడ్డని భుజానేసుకొని గబగబ ఆ గదిలోంచి బయట వరండాలోకి వచ్చింది శమంతకమణి....

ఆ రాత్రి చారుశాస్త్రీ శమంతకమణీ జాగరణచేసి తెల్లారగట్ల అబ్దుల్ ఖాదర్ లేవకముందే ఆటోలో కొంప చేరారు.

మర్నాడే ఏదో సాకుపెట్టి ఆ వూరు నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు చారుశాస్త్రి.... యీసారి ట్రాన్స్‌ఫర్ అయింది మద్రాసుకే- 'శమంతకమణి ఆనందానికి మేరలేదు.... మారుమూల వూర్లన్నీ తిరిగి విసుగెత్తిపోయింది.... హాయిగా బీచ్ కెళ్లొచ్చు సినిమాలూ డ్రామాలూ. బోలెడు ప్రదేశాలు చూడచ్చు !....

మామూలుగా చారుశాస్త్రి తన పై ఆఫీసర్ వయసూ వాలకం చూసిరావడానికి వెళ్లాడు ఆయన రూముకి. ముందు ఆఫీసర్లలా కాకుండా పై ఆఫీసర్ ఆనంద్‌బాబు వయసులో చిన్నవాడేగాక ఒడ్డూ పొడవూ ఆరడుగుల ఎత్తుగల అజానుభాహువూ, అందగాడూ !.... చారుశాస్త్రి గుండె జారిపోయింది !.... యింతవరకూ శమంతకమణి చెయ్యి పట్టుకొన్నవాళ్ళంతా తలనెరిసిన వాళ్లూ పళ్లూడినవాళ్లూ ! ఆనంద్ చేయి పట్టుకొంటే ఏ ఆడదీ కాదనడానికి లేనంత అందగాడు ఆనంద్‌బాబు. శమంతకమణి చెయ్యి పట్టుకొంటే తనంటే యిష్టంలేని శమంతకమణి కాదంటుందా !.... చారుశాస్త్రి తల గిర్రున తిరిగినట్లు అయింది ! ఏం చేయాలో తోచలేదు.... మళ్ళీ ట్రాన్సఫర్ చేయించుకొంటే ?.... ఛీ ఛీ ఏం బ్రతుకు ! తను భార్యకోసం యిన్ని అగచాట్లు పడాలా !.... చీత్తే ఊడిపోయే ముక్కు ఎంతకాలం పట్టుకోగలడు !.... లాభం లేదు !.... తను ఏలాంటి పరిస్థితుల్లోగూడా ఆనందబాబును శమంతకమణి చూసే అవకాశం కలిగించగూడదు.... పార్టీకి అసలు తీసుకెళ్ళ గూడదు....ఏమైనా సరే.... కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి బయల్దేరాడు. కాని యిలా ఎంతకాలం గడపగలడు!- చారుశాస్త్రి బుర్రలో తళుక్కున ఒక మెరుపులాంటి ఆలోచన కలిగింది.... తను గూడా శమంతకమణిని ఆకర్షించే విధంగా నడుచుకొంటే బాగుంటుందేమో తనకెన్నడూ యీ ఆలోచనే రాలేదు.... యికమీద శమంతకమణి మనసుకు నచ్చే విధంగా తన ప్రవర్తన మార్చుకోవాలి! ఏం చేయాలి !.... చారుశాస్త్రి ఆలోచించాడు.... శమంతకమణికి మల్లెపూలంటే యిష్టం !.... బస్సు దిగి పూల అంగడికి వెళ్లాడు.... ఆ రోజు మల్లెపూలు లేవు అన్నాడు.... సీజన్ అయిపోతున్నందువల్ల గిరాకీగా వున్నాయన్నాడు మల్లెపూలు. చారుశాస్త్రి నీళ్లుగారిపోయాడు.... ఛా తన జాతకమే బాగాలేదు.... చామంతి పూలున్నాయి సార్ తీసుకోండి.... అంటూ చామంతి చెండు అందించాడు- పూలవాడు.... చారుశాస్త్రికి చామంతిపూలంటే యిష్టం. ఎందుకో !.... పోనీ ఒట్టిచేతుల్తో వేళ్లేబదులు తీసుకెళ్దామని ఒక రూపాయికి చామంతిపూలు కొని పిల్లలకి అరిటిపండ్లు కొని యింటికొచ్చాడు....

శమంతకమణి వంట పూర్తిచేసి

పక్కింటివాళ్ళతో బీచికి వెళ్ళేందుకు ముస్తాబవుతోంది!.... మంచి మూడ్ లోనే వుందని లోలోపల సంతోషిస్తూ చామంతిపూల చెండు శమంతకమణి చేతి కందించాడు చారుశాస్త్రి!.

"చామంతి పూలా!.... అంతేలెండి మీ 'టేస్టు'.... పక్కింటివాళ్లమ్మాయిలు నాకు మల్లెపూలు తెచ్చిచ్చారు..."అంటూ చారుశాస్త్రి యిచ్చిన చామంతి చెండు ఓ పక్కన పడేసి మల్లెపూలు తల్లో పెట్టుకున్నది శమంతకమణి!....ఉసూరుమన్నాడు చారుశాస్త్రి! చామంతి పూలు తీసి దేవుడి కేలండరు కేసి పండ్లు పిల్లకిచ్చాడు....

"మీ పైఆఫీసర్ గారు ఎవరో ఆనంద్ బాబుట! రేపు ఆయన పుట్టిన రోజు పార్టీ అని మనల్నిరమ్మని వాళ్ల 'ప్యూన్' చేత యీ కార్డు పంపించాడు" అంటూ ఒక ఇన్విటేషన్ కార్డు చారుశాస్త్రి చేతికిచ్చి మళ్లీ తన మస్తాబులో మునిగిపోయింది శమంతకమణి!....చారుశాస్త్రి గుండె గతుక్కుమంది!.... ఏ విధంగా తను యీ దేంజర్నుంచి బయట పడగలడు?....

"రేపు వెళ్తున్నామా!...." అన్నది శమంతకమణి.

"వెళ్లాలా!...." అన్నాడు అసలే లోలోపల మండిపోతున్న చారుశాస్త్రి కోపంగా!....

"బాగుందండోయ్! యిదేమిటీ వెళ్తే నాకేం వెళ్ళకపోతే నాకేం! మానెయ్యండీ!...."

"పార్టీ కెళ్లాలంటే యీ చీర తప్ప మరో చీర లేదు. ఏదన్నా కొత్త చీర కొనుక్కురండని చెప్పడానికి అడిగాను"

చారుశాస్త్రి ఒళ్లు భగ్గుమంది!.... కొత్తచీర వేరే కొనాలా పార్టీ కెళ్లడానికి!

"వీల్లేదు!– రేపుసాయంకాలం నాకు పనుంది.... డాక్టర్ దగ్గరికెళ్లాలి....నాకు పళ్లు నొప్పిగా వుంది....




"ఓహో సరే! అయితే రేపు పక్కింటివాళ్ల ఏదో హిందీ సినిమా కెళ్తున్నారట నేనూ వెళ్తాను".... అన్నది విసురుగా జడ వెనక్కి వేసుకొంటూ–

"అలాగే!".... బ్రతుకు జీవుడా అనుకున్నాడు చారుశాస్త్రి.

మర్నాడు ఆఫీసులో ఆనంద్ బాబు తనకింద పనిచేసేవాళ్లందర్నీ పర్సనల్గా ఆహ్వానించాడు.... చారుశాస్త్రి కొత్తగా వచ్చాడని తెలిసి ఎక్కువసేపు మాట్లాడాడు– మాటల్లో చారుశాస్త్రి యింటి పేరూ వూరూ, చారుశాస్త్రి మామగారి పేరూ వివరాలన్నీ తెలిశాయి ఆనంద్ బాబుకి!....

"చంపేశావయ్యా!.... నీ భార్య శమంతకమణి మా వేలువిడిచిన మేనమామ కూతురౌతుంది!.... చాలా దగ్గర బంధువులన్నమాట!. అంటూ ఆనంద్బాబు చారూశాస్త్రి భుజం మీద స్నేహపూర్వకంగా చేయివేశాడు. చారూశాస్త్రి మరొక సారి గతుక్కున్నాడు!....యిది కొత్త 'కాంప్లికేషన్'! బంధుత్వం వేరే తగలడాలా!.... యిక చేసేదేముంది!.... ఏదో ఒక రోజు తప్పక కలుస్తారు!....అసలు శమంతకమణితో పార్టీకి రాంది వూరుకోదేమో!. చచ్చాన్రా భగవంతుడా! ఏమిటి నాకీ విషమ పరీక్ష!– చారుశాస్త్రి మనసు ఆందోళనతో నిండిపోయింది!

"మంచిది సార్! మీరు గొప్పవారు! మేమంతా మిడిల్క్లాస్ వాళ్లం! మీకూ మాకూ బంధుత్వాలేమిట్లేండి!....చెప్పినా మీకే చిన్నతనంగా వుంటుంది!.... వస్తాను సార్!...." అని, జవాబుకి ఎదురుచూడకుండా గబగబ ఆనంద బాబు రూములోంచి బయటకు వొస్తున్న చారుశాస్త్రికి "రేపు పార్టీకి శామూతో తప్పక రావాలి, చిన్నప్పుడెప్పుడో చూశాను. శామూను తప్పక తీసుకురా శాస్త్రీ!...." అని ఆనంద్ బాబు అంటూంటే చారుశాస్త్రి ఒళ్ళంతాభయంతో వణకడం" మొదలెట్టింది.... చూస్తాను సార్!– దాని కేదో పళ్లు నొప్పి అంది! డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి అంది" అన్నాడు చారూశాస్త్రి పూర్తిగా వెనక్కి తిరిగి అబద్ధం ఆడే ధైర్యంలేక....

"ఓస్ దానికేముంది!....మన ఫామిలీ డాక్టర్ వున్నాడు పక్కనే" అన్నాడు. ఆనంద్బాబు చారుశాస్త్రి దగ్గరికివస్తూ! లాభం లేదు. యిక తను అబద్ధాలు చెప్ప లేదు!....చాతకాదు...."వస్తాను సార్!"

అని మాత్రం చెప్పి గిర్రునతిరిగే తలను గట్టిగా పట్టుకుని బస్సులో పడి ఎలాగో యిల్లు చేరాడు.

తనలాంటి అసమర్ధుడూ పిరికివాడూ శమంతకమణిని చేసుకొని వుండగూడదు. తనమీద తనకే అసహ్యం వేసింది!....

ఇంటికొస్తూనే "ఏమండీ మీ పై ఆఫీసర్ ఆనంద్‌బాబు మా బంధువండీ!.... లెటరు పంపాడు!....నన్ను తప్పక తన బర్త్‌డే పార్టీకి రమ్మని!...."అంటూ ఒక లెటరు శాస్త్రి చేతి కందించింది.... అప్పటికే తనకున్న ఒకే ఒక కొత్త చీర కట్టి బయల్దేరడానికి రెడీగా వున్న శమంతకమణి!.

చారుశాస్త్రి నోట మాటలేకుండా నిలువునా కొయ్యబారి నిలబడిపోయాడు!.... ఎమిటిదీ!.... విధి తనను యిలా పరీక్షిస్తోంది!.... యిప్పుడేం చేయడం!.... తను ఏం చెయ్యగలడు గనక!.... శమంతకమణి మాటిమాటికీ దెప్పిపొడుస్తుంటుంది కాఫీ ఫిల్టర్ కొనేందుకు యోగ్యతలేదు!....చంటివాడి చొక్కాతో డికాక్షన్ వడియకట్టిస్తూంటే తాగే తను శమంతకమణిని ఎలా రక్షించుకోగలడు!. ఆకర్షణ అనే శక్తిని ఎలా ఆపగలడు! విరక్తితో చాప మీద కూలబడి గోడకు చేరబడ్డాడు.

"అదేమిటండీ! పార్టీ అంటే మీకు ఎక్కడలేని నీరసం వస్తూందీ!.... అతనేం పరయివాడు గాదు_ మా బంధువేగా!....యింతదూరం వచ్చి పిల్చిన తర్వాత పోకపోతే ఏం బావుంటుందీ!.

చారూశాస్త్రి శమంతకమణితో ఘర్షణ పడదల్చుకోలేదు....తన తల రాత ఎలా వుంటే అలా జరుగుతుందని మనసు రాయిచేసుకుని పార్టీకి శమంతకమణితో వెళ్ళడానికి తీర్మానించుకున్నాడు.

చారుశాస్త్రి పిల్లల్ని పక్కింట్లో వదిలి వచ్చేలోగా యింటిముందు కారు ఆగింది. ఆనంద్‌బాబు!.... చారుశాస్త్రి గుండెల్లో రాయిపడ్డది!.... ఆనంద్‌బాబు కారు దిగి రావడం శమంతకమణి ఇంటికి తాళం వేయడం ఒకేసారి జరిగాయి!.

"అరే శామూ! ఎంత పెద్దదానివయి నావే!.... చిన్నప్పుడు చూశాను!.... గుర్తున్నానా!.... యూ లుక్ సో బ్యూటిఫుల్! టెరిఫిక్!...."అంటూ శమంతకమణి దగ్గర కెళ్లి కళ్లలో కళ్లుపెట్టి చూస్తున్న ఆనంద్‌బాబు అందాన్నీ పర్సనాలిటీనీ శమంతకమణి రెప్పవాల్చకుండా చూస్తూ ప్రతిమలా నిలబడిపోయింది.

వాళ్లిద్దర్నీ ఆ పరిస్థితిలో చూస్తూ నిలబడ్డ చారూశాస్త్రి పరిస్థితి వర్ణనాతీతం!

"సార్!...."యిక బయల్దేర్దామా!.... అంటూ వాళ్ళ చూపుల్ని మళ్లించడానికి ప్రయత్నించాడు!....ఊహూ....ఆనంద్‌బాబు శమంతకమణి మీదినుంచి చూపు తిప్పుకోకుండానే, "శామూ! చిన్నప్పుడు 'ఆగవే మరదలా!' అనిపాడేవాడిని నువ్వు సంక్రాంతికి మా యింటికి వొస్తే గుర్తుందా!...."అన్నాడు ఆనంద్‌బాబు శమంతకమణి భుజం మీద చేయేస్తూ.... శమంతకమణి ఒళ్ళంతా పులకరించింది. ఆనంద్ సంభ్రమాల్తో మాట పెగల్లేదు!.... చారుశాస్త్రి కోపాన్ని అణుచుకొంటూ "యిక బయల్దేర్దామా!...." అన్నాడు యీ లోకంలో లేని వాళ్లదగ్గరగా వచ్చి.... "ఓ యస్ విత్ ప్లెజర్! రా శామూ" అంటూ కార్లో శమంతకమణిని తన పక్కముందు సీట్లో కూర్చోబెట్టి తను స్టీరింగ్ దగ్గర కూర్చున్నాడు. యిది మరీ ఘోరం. చారూశాస్త్రి చేసేది లేక వెనక సీటులో తలుపు తీసి ముళ్లమీద కూర్చున్నట్టు సీటు మొనలో కూర్చున్నాడు. కారు బయల్దేరింది.... "శామూ చిన్నప్పుడు నీవు బొమ్మల పెళ్లిళ్ళు చేస్తుంటే పెళ్లికొడుకు నెత్తుకుపోయి దాచేసేవాణ్ణి నీకు గుర్తుందంటే!...." అన్నాడు ఆనందబాబు.

"లీలగా గుర్తుంది బావా!...." అన్నది శమంతకమణి_ వరసలుగూడా కలిశాయి. చారుశాస్త్రి ఒళ్లు కారం రాచినట్లు మండిపోతోంది.

బావా అకనపోతే ఏం!.... కారు ఎంత వేగంగా పోతుందో వాళ్లిద్దరి సంభాషణా నవ్వులూ అంత కంటే జోరుగా సాగుతున్నాయి!.... శమంతకమణికి కావాల్సింది అలాంటి హోదాగల భర్త, బ్రతుకు!.... శమంతకమణి ఆనందబాబుతో మాట్లాడేప్పుడు ఎన్నడూ చూడని కాంతి కనిపించింది చారుశాస్త్రికి! శమంతకమణి వైపే చూస్తూ మాట్లాడడంలో ఒకటి రెండు సార్లు ఆనందబాబు రోడ్లో సడన్ బ్రేక్సు వేయాల్సి వచ్చింది, యాక్సిడెంట్స్ కాకుండా!"

"పార్టీ కంతా వచ్చారా బావా!...."

"అహా నీకే పళ్లనొప్పి అని ఎక్కడ రాకుండా ఎగ్గొడతావో అని కారు తీసుకొచ్చాను రాణీగారికి!...." అన్నాడు ఆనందబాబు. శమంతకమణి విస్తుపోయి "నాకు పళ్ల నొప్పా! ఎవరు చెప్పారు" అన్నది.


"శాస్త్రీ!_" అన్నాడు విషయం అర్థం చేసుకున్న ఆనందబాబు నవ్వుతూ.... చారుశాస్త్రి గతుక్కుమని వెనక సీట్లో చేరబడి కళ్ళు మూసుకున్నాడు శమంతకమణి తన వైపు చూస్తుందనే భయంతో. ఆనందబాబు భవనం ముందు కారు ఆగింది. ఎంత పెద్ద మేడ!.... ఎంత విశాలమైన ఆవరణ!.... కొన్ని లక్షలుంటుందా యిల్లు!.... కారు దిగుతూనే శమంతకమణి కళ్ళు జిగేలుమని మెరిశాయి.... యింటి ముందు రంగు రంగుల దీపాల్తో అలంకరణ చేశారు! శమంతకమణికా యిల్లూ ఇంద్రభవనంలా కనిపించింది.... చారుశాస్త్రి దిగి కారు దగ్గరే నిలబడ్డాడు.



“రా శామూ....”అంటూ భుజంమీద చేయివేసి “అందరికీ పరిచయం చేస్తాను. వచ్చిన ఆడవాళ్ళంతా నీతో పోలిస్తే దివిటీ ముందు దీపాలే లే!....” అని ఆనందబాబు అంటూంటే శమంతకమణి చెవుల్లో అమృతంపోసినట్లు లోలోపల ఉప్పొంగిపోయింది! ఆనందబాబు లాంటి వాడు తనకి భర్త అయితే తన జీవితం స్వర్గం అయివుండేది.... తన దురదృష్టం.... శమంతకమణి ఆనందబాబు పక్కన పరిసరాల్నీ చారుశాస్త్రినీ యీ ప్రపంచాన్నే మర్చిపోయి జీవితంలో మొదటిసారిగా పంజరంలోంచి బయట పడ్డ పక్షిలా సంతోషంతో శమంతకమణి హృదయం గంతులువేయడం మొదలెట్టింది.... ఆనందబాబు అందరికీ పరిచయం చేసేప్పుడు చాలా మంది తెలీని కొత్త గెస్టులు ‘మీ భార్య చాలా అందగత్తె సార్!’ అనడం మొదలెట్టారు. ఆనందబాబు “చూశావా శాము! నువ్వు నన్నే పెళ్ళాడి వుంటే ఎంత బావుండేది,” అంటూ శమంతకమణిని మరి కాస్త దగ్గరగా నొక్కిపట్టుకున్నాడు.... అలాంటి హోదాగల భర్తగలది అదృష్ట వంతురాలు

“ఏయ్ డ్రైవర్! కారుకాస్త అవతలకు తీసిపెట్టు మా కారు లోపలికి రావాలి” అన్నాడు అప్పుడే వచ్చిన ఎవరో గెస్టుల కారు డ్రైవర్, కారు పక్కన నిలబడ్డ చారుశాస్త్రిని డ్రైవర్ అనుకొని....

“నేను డ్రైవర్ కాదయ్యా నా ఖర్మ కాలి!.... కావాలంటే నువ్వే చెయ్ ఆ పని అని చిరాగ్గా వెళ్ళి చారుశాస్త్రి వేప చెట్టుకింద సిమెంట్ సీట్లో కూర్చున్నాడు! తాను ఒకడూ పక్కన వడ్డాడనే విషయం శమంతకమణి మర్చిపోయింది! ....ఏమికానున్నదో ఈశ్వరేచ్ఛ!.... కణతలు పట్టుకొని కూర్చున్నాడు....




ఎవడో బట్లర్ టిఫిన్ ప్లేటు చేతి కందించాడు. అలోచనల్లతో ఆకలయిన చారుశాస్త్రి తనకు తెలియకుండానే ప్లేటు ఖాళీచేశాడు.... నీళ్లు కావాలి ?.... లేక పోతే ఎక్కిళ్లొస్తాయి !.... శమంతకమణికి కొపం వస్తోంది ! ఆనంద్‌బాబు ముందు అవమానం అవుతుంది !.... పక్కనేవున్న కోళాయి దగ్గరకు వెళ్ళి నాలుగు గుక్కలు నీళ్లు తాగాడు.

పార్టీలో శమంతకమణిని పరిచయం చేస్తుంటే ఒకావిడ అడిగింది "మీ భార్యండీ !...." అని.... "లేదండీ నా భార్య చనిపోయి సంవత్సరం అయింది" అన్నాడు ఆనంద్‌బాబు.... యీ సంగతి మొదటిసారిగా విన్న శమంతకమణికి 'షాక్'తో పాటు ఏదో తనకు తెలీని సంతోషమూ అనిర్వచనీయమైన ఆనందమూ లోలోపలే కలిగాయి.... "అక్క లేదా బావా !" అన్నది.... "నువ్వు ఉన్నావుగా మరదలా" అన్నాడు. శమంతకమణి సిగ్గుతో తలవంచుకొంది. "పద, నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి...." అంటూ ఆనంద్‌బాబు శమంతకమణిని లోపలికి తీసుకెళ్లాడు.... చారుశాస్త్రి సంగతే మర్చిపోయిన శమంతకమణి ఆనంద్‌బాబు ఆనందంలో పడి అతన్ని అనుసరించింది....

టిఫిన్ కడుపులో పడగానే ఎప్పుడు నిద్రపట్టిందో చారుశాస్త్రి గురు పెడుతూంటే పనివాడు వచ్చి లేపాడు.... ఉలిక్కిపడి లేచి చారుశాస్త్రి గంటెంత అయిందని అడిగాడు. గంట సంగతి తెలీదు పార్టీ అయింది.... అని వాడు ముందున్న ప్లేటు తీసుకెళ్లాడు.... చారుశాస్త్రి ఖంగారుపడుతూ లోపలి కెళ్తే మేడ మెట్లు దిగి చట్టాపట్టీల్తో వస్తున్నారు శమంతకమణి, ఆనంద్‌బాబు. చారుశాస్త్రి గుండె వేగంగా కొట్టుకోడం మొదలెట్టింది ! ఏమిటీ అన్యాయం ! "యింటికి పోదాం" అన్నాడు హీన స్వరంతో.... ఆనంద్‌బాబు ఏం చెప్పాడో ఏమో శమంతకమణి తను యిక చారుశాస్త్రితో ఆ యింటికి రానని ఖచ్చితంగా చెప్పేసింది !.... అది విన్న చారుశాస్త్రి నిర్ఘాంతపోయి నిలబడ్డాడు !.... "మరి పిల్లలూ" అన్నాడు హీనస్వరంతో చారుశాస్త్రి.

"వాళ్లని హాస్టల్లో పడేయండి !...." అన్నది అలక్ష్యంగా శమంతకమణి !....

"అపును శాస్త్రీ ఎందుకలా బెంబేలు పడతావ్ !.... నేనే శామూని యిక్కడ వుండమన్నాను !.... చూడు ఎంత పెద్ద యిల్లో ! నాకెవరున్నారు ! యింత యిల్లూ అస్తీ ఏం చేసుకోను !.... ఎంతకాలం నీ చాలీచాలని జీతంతో తన కోరికలన్నీ చంపుకుని, ఆ మారుమూల మురికి కాలవ పక్కన పోర్షన్‌లో వుండగలదు! అసలు ఆ నరకం అనుభవించాల్సిన ఖర్మేమిటి శామూకి నేనుండగా !....యీ దరిద్రానికి తోడు పట్టుమని పాతికేళ్ళు గూడా లేవు అప్పుడే శామూకి యిద్దరు పిల్లలా!.... నీ సంగతే నీవాలోచించావు గాని శామూకి ఏం కావాలో ఎప్పుడైనా ఆలోచించావా !.... యిక శామూ ఆ నరకంలోకి రాదు. కావాలంటే పిల్లల్ని హాస్టల్లో పడేసి వచ్చి నువ్వూ యిక్కడే వుండు. అవుట్‌హవుస్ వెనకాల వుంది! శామూ రాదు.... శామూ నీకు బెడ్ రూము చూపిస్తాను" అని చారుశాస్త్రి జవాబుకి ఎదురుచూడకుండానే శమంతకమణి చెయ్యి పట్టుకుని పక్కగదిలోకి తీసుకెళ్లాడు ఆనంద్‌బాబు ! కుప్ప కూలిపోయిన చారుశాస్త్రి తనలో తాను గొణుక్కొన్నాడు.... చివరకి ఇందుకా తను ఇన్ని ట్రాన్సఫర్లూ చేయించుకొన్నాడు !

———